సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 27 । జనవరి । 2025



స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, చిత్రంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు



పాల్మాకుల మహాత్మాజ్యోతిబాపూలే రెసిడెన్షియల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



లక్ష్యం.. సంక్షేమం

జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కండి

- ప్రజల బంగారు భవిత కోసం ప్రభుత్వం కృషి
- అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తాం
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రజల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కలెక్టరేట్‌లో జాతీయజెండాను ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర సమరయోధుడు ఎ.రామిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఆయా శాఖల శకటాల ప్రదర్శనను వీక్షించారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆయన మాటల్లోనే..

పేదల సంక్షేమానికి పెద్దపీట

ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. సమగ్ర సర్వేలో భాగంగా 5,62,598 కుటుంబాల సమగ్ర సమాచారం సేకరించాం. ఆయా పథకాలకు అర్హులను గుర్తించే ప్రక్రియను ప్రారంభించాం. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడే 3,11,459 కుటుంబాలకు జీరో విద్యుత్ బిల్లులు జారీ చేస్తున్నాం. మహాలక్ష్మి పథకం కింద రూ.500కే వంటగ్యాస్ పథకం కింద 2,32,405 మంది లబ్ధిదారులకు రూ.15.34 కోట్లకుపైగా వారి ఖాతాల్లో జమ చేశాం. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 24.16 కోట్ల జీరో టికెట్లు జారీ చేశాం. వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళ, చేనేత, బీడీ, గీత కార్మికులు, బోధకాల బాధితులకు పెన్షన్ కింద ప్రతి నెలా 1,97,283 మందికి రూ.48.29 కోట్లు చెల్లిస్తున్నాం. 3,75,013 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి గ్రామ సభల్లో ప్రకటించాం. 2,60,372 మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అర్హులందరికీ జారీ ప్రక్రియ మొదలు పెట్టాం.

రైతును రాజును చేయడమే లక్ష్యం

సాగుకు యోగ్యమైన భూములు కలిగిన రైతుల ఖాతాల్లో నగదు జమ చేసే ప్రక్రియ మొదలుపెట్టాం. సెంటు భూమి లేని రైతు కూలీలను గుర్తించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఆర్థిక సాయం అందజేస్తున్నాం. రెండు లక్షల రుణమాఫీ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 1,00,268 మంది రైతులకు సంబంధించిన రూ.769.53 కోట్ల రుణాలను మాఫీ చేశాం.

ఆరోగ్య సేవల్లో అగ్రస్థానం

27 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 80 బస్తీ దవాఖానాలు, 158 పల్లె దవాఖానాల ద్వారా ప్రజల ఆరోగ్య ప్రమాణాలను మెరుగుపర్చడంలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఏడాదిలో 46,876 మందికి శస్త్ర చికిత్సల కోసం రూ.139.88 కోట్లు ఖర్చు చేశాం.

మహిళా సంఘాలకు బాసట

బ్యాంక్ లింకేజీ ద్వారా 8,879 సంఘాలకు రూ.757.60 కోట్ల రుణాలు అందజేశాం. స్త్రీనిధి సంస్థ ద్వారా రూ.10.43 కోట్ల రుణాలిచ్చాం. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా 900 పట్టణ ప్రాంత స్వయం సహాయక మహిళలకు రూ.31.51 కోట్లతో పండ్లు, కూరగాయలు, బేకరీ ఉత్పత్తులు, పాలు, పెరుగు, బ్యూటీ పార్లర్లు, ఫ్యాన్సీ స్టోర్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

విద్యా ప్రమాణాలు

761 స్కూళ్లను అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేసి మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.23.9 కోట్లు మంజూరు చేశాం. 225 పాఠశాలలకు స్కూల్ నిర్వహణ గ్రాంటు కింద రూ.7 .83 కోట్లు మంజూరు చేశాం. 1,47,642 మంది విద్యార్థులకు రూ.8.86 కోట్ల ఖర్చుతో రెండు జతల యూనిఫాంలు పంపిణీ చేశాం. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 547 మంది బాలబాలికలకు విముక్తి కల్పించాం.

ప్రగతికి ప్రత్యేక ప్రణాళికలు

ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్లు కేటాయించాం. తుర్కయంజాల్, జల్‌పల్లి మున్సిపాలిటీల్లోని రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణాలకు రూ.64.69 కోట్లు మంజూరు చేశాం. కోహెడలో రూ.403 కోట్ల అంచనా వ్యయంతో ఆసియాలోనే అతి పెద్ద పండ్ల మార్కెట్ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నాం. 549 పంచాయతీల నుంచి రూ.15.49 కోట్లు, 16 పట్టణ స్థానిక సంస్థల నుంచి రూ.122.25 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేసి అభివృద్ధికి ఖర్చు చేశాం.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

వేడుకల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహేశ్వరం సాంఘీక సంక్షేమశాఖ వసతి గృహం విద్యార్థులు ప్రదర్శించిన 'మాతుజే సలాం', కందుకూరు కేజీబీవీ విద్యార్థులు 'చదువేగానం.. చదువే ధైర్యం..' అంటూ ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకున్నాయి. పాల్మాకుల మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూలు విద్యార్థుల బతుకమ్మ, కోలాట ప్రదర్శనలు, నాదర్‌గుల్ డీపీఎస్ స్కూల్ విద్యార్థులు జై జవాన్..జై కిసాన్ అంటూ ప్రదర్శించిన నృత్యరూపకం, తుక్కుగూడ జెడ్పీ స్కూలు చిన్నారులు ప్రదర్శించిన బంజారా నృత్యం అలరించాయి.



ఆకట్టుకున్న విద్యాశాఖ శకటం



తుక్కుగూడ జెడ్పీ స్కూల్ విద్యార్థుల బంజారా నృత్యం



పాల్మాకుల మహాత్మాజ్యోతిబాపూలే విద్యార్థుల నృత్య ప్రదర్శన

న్యూస్‌రీల్

మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పాలకమండళ్ల గడువు ఆదివారంతో ముగిసింది. దీంతో ఆయా పురపాలికలు ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లాయి. ప్రభుత్వం ఒక్కో మున్సిపాలిటీకి ఒక్కో అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించింది. జిల్లాలోని ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం, మీర్‌పేట, పెద్ద అంబర్‌పేట, షాద్‌నగర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీలకు అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను ప్రత్యేక అధికారిగా నియమించింది. తుక్కుగూడ, జల్‌పల్లి ఆమనగల్లు మున్సిపాలిటీలకు బి.శ్రీనివాస్ (జేడీఎంఏ)ను ప్రకటించింది. బడంగ్‌పేటకు సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరెడ్డిని ప్రత్యేక అధికారిగా నియమించింది. బండ్లగూడ జాగీర్, నార్సింగి, శంషాబాద్ మున్సిపాలిటీలకు పి.శ్రీధర్‌ను, శంకర్‌పల్లి మున్సిపాలిటీకి వి. సాయినాథ్‌ను, మణికొండ మున్సిపాలిటీకి జె.శ్రీనివాసరావును ప్రత్యేక అధికారులుగా నియమించింది.

వైభవంగా శ్రీరుద్ర సహిత శతచండీ యాగం



కందుకూరు: మండలంలోని దాసర్లపల్లి సమీపంలోని శ్రీమాత క్షేత్రంలో చండీ ఉపాసకులు రేవెళ్ల రాజుశర్మ ఆధ్వర్యంలో 108 యజ్ఞగుండాలతో చేపట్టిన శ్రీరుద్ర సహిత శత చండీ యాగం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం గోపూజ, ధ్వజారోహణం, యాగశాల ప్రవేశంతో ప్రారంభించారు. సాయంత్రం శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం, సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అన్న ప్రసాదం అందించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మున్సిపల్ పాలకవర్గానికి ఘనంగా సత్కారం



ఆమనగల్లు: మున్సిపల్ పాలకవర్గ పదవీ కాలం పూర్తికావడంతో కమిషనర్ వసంత ఆధ్వర్యంలో ఘన సత్కారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లను కమిషనర్ వసంత సత్కరించారు. రాంపాల్‌నాయక్ మాట్లాడుతూ.. ఐదేళ్లు ఆమనగల్లు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని చెప్పారు. సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు

రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్



వెంకటాపూర్‌లో లబ్ధిదారులకు పత్రాలు అందిస్తున్న మెట్టు సాయికుమార్

మొయినాబాద్: అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఆదివారం ప్రజాపాలన ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తామన్నారు. అర్హులు ఎవరికైనా పథకాలు రాకుంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. వెంటనే అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిషన్‌రావు, తహసీల్దార్ గౌతంకుమార్, ఎంపీడీఓ సంధ్య, ఏఓ అనురాధ, ఎంపీఓ వెంకటేశ్వరరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వినోద్, ఆర్ఐ సుజిత్‌రెడ్డి, ఏఈఓలు సునీల్, కుమార్, మాజీ సర్పంచ్ మనోజ్ కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యులు రాంరెడ్డి, లక్ష్మణ్, నాయకులు మహేందర్ ముదిరాజ్, యాదయ్య, శంకర్ పాల్గొన్నారు.



సమావేశంలో ఇరువర్గాలను శాంతింపజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

వాగ్వాదం.. గందరగోళం

- నరస్వతిగూడలో నాలుగు పథకాల ప్రారంభం
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం
- శాంతింపజేసి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందించిన ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాలుగు పథకాల కార్యక్రమం వాగ్వాదానికి, గందరగోళానికి దారి తీసింది. ప్రజా పాలనలో భాగంగా మండల పరిధిలోని సరస్వతిగూడలో ఆదివారం నాలుగు పథకాలను ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరై లబ్ధిదారుల వివరాలు అధికారులతో చదివించారు. చాలా మంది తాము అర్హులైనా తమ పేర్లు లిస్టులో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే అర్హుల పేర్లు ఎందుకు చేర్చలేదని అధికారులను నిలదీశారు. వారు వివరణ ఇచ్చే క్రమంలో ప్రజలను అనవసరంగా రెచ్చగొడుతున్నారంటూ కొందరు కాంగ్రెస్ నాయకులు కల్పించుకున్నారు. అటు బీఆర్‌ఎస్, ఇటు కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే వారందరినీ శాంతింపజేసి లబ్ధిదారులకు పథకాల సర్టిఫికెట్లు అందించారు. అనంతరం అర్హులై ఉండి పథకాలు అందని వారి ఇళ్లకు నేరుగా వెళ్లి పరిశీలించారు. అంతకుముందు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా పాలన పేరుతో దరఖాస్తు చేసిన తర్వాత కూడా అర్హుల నుంచి మళ్లీమళ్లీ అప్లికేషన్లు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఎందుకు ఇవ్వరని నిలదీశారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందే వరకు వారి వెంట ఉంటామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సుధారాణి, తహసీల్దార్ గోపాల్, ఎంపీడీఓ సరిత, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ జి.విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా పేర్లు ఎందుకు లేవు..?

చేవెళ్ల: మండలంలోని ఈర్లపల్లిలో సంక్షేమ పథకాల ప్రారంభం రసాభాసగా మారింది. పథకాలకు సంబంధించిన అర్హుల జాబితా చదువుతుండగా గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. జాబితాలో తమ పేర్లులేవని, అధికార పార్టీకి చెందినవారికే వచ్చాయంటూ నిలదీశారు. దీంతో కార్యక్రమం గందరగోళంగా మారింది. పోలీసులు, స్థానిక నాయకులు, ఆర్డీఓ చంద్రకళ సర్ది చెప్పేందుకు ప్రయత్నించినా వినిపించుకోలేదు. దీంతో ఎమ్మెల్యే కాలె యాదయ్య మైక్ అందుకున్నారు. ఓవైపు గ్రామస్తులు ప్రశ్నిస్తున్నా, మరోవైపు అలాగే మాట్లాడి పలువురికి మంజూరు పత్రాలు ఇచ్చి వెళ్లిపోయారు. తరువాత కూడా గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మళ్లీ దరఖాస్తులు ఇవ్వాలని నచ్చజెప్పారు. పంచాయతీ వద్ద మళ్లీ దరాఖాస్తులు స్వీకరించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

నందిగామ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని విడతల వారీగా నెరవేర్చుకుంటూ పోతున్నామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు పథకాలను ఆదివారం మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో ప్రారంభించారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేసిన అనంతరం మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్నా ఏ ఒక్కరికీ రేషన్ కార్డు, డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వలేకపోయిందని విమర్శించారు. ఏ మాత్రం అభివృద్ధి లేకుండా రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్ని కష్టాలు ఎదురైనా ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ అంటే మాట తప్పని పార్టీ అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేవలం కల్వకుంట్ల కుటుంబ సభ్యులే పాలించారని, కాంగ్రెస్ పాలనలో అన్ని మతాలు, కులాలు, వర్గాలను కలుపుకొని పోతున్నట్టు పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు మాత్రమే కాకుండా రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని ఆయన వివరించారు. సంక్షేమ ఫలాలు అందించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. మాట తప్పని, మడమ తిప్పని నేతగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఏ విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టారో అదే విధంగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం పని చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో రాజసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనా రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ప్రతాప్‌రెడ్డి, బీష్వ కిష్టయ్య, కృష్ణారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహ యాదవ్, తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీఓ సుమతి, ఏఓ వాణి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు చంద్రపాల్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ చీఫ్‌కు ఘన స్వాగతం

షాద్‌నగర్: ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌కు ఆదివారం షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు స్వాగతం పలికారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన ఆయనను ఘనంగా సత్కరించారు. క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్న భోజనం ముగించుకొని ఆయా పథకాలను ప్రారంభించేందుకు ఆయన నందిగామ మండలం అప్పారెడ్డిగూడ గ్రామానికి భారీ ర్యాలీతో తరలివెళ్లారు.

ఎన్నికల హామీలు అమలు చేస్తున్నాం

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

శంషాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలకు అమలుకు చర్యలు చేపట్టిందని ఎమ్మెల్సీ, మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు పథకాలను ఆదివారం ఆయన మండలంలోని సుల్తాన్‌పల్లిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రెండు హామీలను అమలు చేసిందని, మిగిలిన హామీలను అమలు చేయడం సంతోషంగా ఉందన్నారు. గ్రామస్తులకు 76వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయనడానికి సుల్తాన్‌పల్లి ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌దత్ తదితరులు పాల్గొన్నారు.

'పుర' సమాప్తం

ముగిసిన మున్సిపాలిటీ పాలకవర్గం పదవీకాలం



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: ఐదేళ్ల పాటు అధికారంతో కళకళలాడిన మున్సిపాలిటీలు సోమవారంతో వెలవెలబోతున్నాయి. మున్సిపల్ పాలకవర్గ పదవీకాలం ముగుస్తుంది. 2020 జనవరి 22న మున్సిపల్ ఎన్నికలు జరగగా ఓట్ల లెక్కింపు 25న చేపట్టారు. 27న చైర్మన్లు, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఆదివారానికి పాలకవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టి ఐదేళ్లు పూర్తి కావడం గమనార్హం. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని పాలకవర్గం ప్రారంభం నుంచి పలువురు కౌన్సిలర్లు, చైర్ పర్సన్ కప్పరి స్రవంతిచందుపై అవిశ్వాసం పెట్టినా పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడి పదవిని కాపాడుకుంది. ఆ కొద్ది రోజులకే వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిపై కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టగా ఆయన పదవిని నిలుపుకోలేక పోయారు. అనంతరం జరిగిన వైస్ చైర్మన్ ఎన్నికలో బర్ల మంగయాదవ్ విజయం సాధించారు. దీంతో ఐదేళ్ల కాలంలో ఒక చైర్మన్, ఇద్దరూ వైస్ చైర్మన్లు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి పని చేశారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఎన్నో ఒడిదొడుకులను పాలకవర్గం ఎదుర్కొంది. అయితే అభివృద్ధి విషయంలో కొంత వెనుకబాటు కనిపించిందని స్థానికుల అభిప్రాయం. కాగా మున్సిపల్ ఎన్నికలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టక పోవడంతో మున్సిపాలిటీలు ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లనున్నాయి. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి ప్రత్యేకాధికారిగా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ నియమితులయ్యారు.

మళ్లీ వచ్చేవారెవరో

వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కొంత మంది కౌన్సిలర్లు పోటీకి విముఖత చూపుతుండగా మరికొంత మంది సుముఖత వ్యక్తం చేస్తున్నారు. రిజర్వేషన్లు, ఆయా పార్టీల టికెట్ల కేటాయింపులను బట్టి భవిష్యత్తులో ఎంతమంది తిరిగి కౌన్సిల్‌లోకి అడుగుపెడుతారో వేచి చూడాలి. పదవీకాలం ముగియడంతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని చైర్ పర్సన్ స్రవంతి, వైస్ చైర్‌పర్సన్ మంగ, కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు.

పెద్దఅంబర్‌పేట ప్రత్యేకాధికారిగా ప్రతిమాసింగ్

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం ప్రత్యేకాధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పురపాలక సంఘాల పాలకవర్గాల పదవీకాలం ఆదివారంతో ముగియడంతో ఎన్నికల జరిగేంత వరకూ ప్రత్యేకాధికారుల పాలనే కొనసాగనున్నాయి.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారురాలికి ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి



చేవెళ్ల: ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- కప్పపహాడ్‌లో పథకాల ప్రారంభోత్సవం

ఇబ్రహీంపట్నం రూరల్: పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలనలో భాగంగా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కప్పపహాడ్ గ్రామంలో ఆదివారం నాలుగు పథకాలను ఎమ్మెల్యే మల్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశాన్ని ప్రజలకు వినిపించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ప్రొసీడింగ్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామన్నారు. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, గ్యాస్‌పై రూ.500 సబ్సిడీ ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అందరికీ రేషన్ కార్డులు అందించే లక్ష్యంతో ముందుకు పోతున్నామన్నారు. భూమిలేని నిరుపేదలకు ఉపాధి హామీలో 20 రోజులు పని చేస్తే ఆత్మీయ భరోసా పేరుతో ఏడాదికి రూ.12 వేలు మహిళలకు ఇస్తామని స్పష్టం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ పథకాలు అందించే బాధ్యత తమపై ఉందన్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాబోయే రోజుల్లో 20వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ప్రాధాన్యత క్రమంలో కేటాయిస్తామన్నారు. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

సమావేశంలో కరెంట్ కటకట

సంక్షేమ పథకాలు అమలు కోసం కప్పపహాడ్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే సమావేశానికి కరెంట్ కటకట వెంటాడింది. ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతుండగా రెండుసార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఎమ్మెల్యే అసహనానికి గురయ్యాడు. ఆ వెంటనే విద్యుత్ సరఫరా కావడంతో సభ సాఫీగా సాగింది. సమావేశంలో ఆర్డీఓ అనంతరెడ్డి, ప్రత్యేకాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ వెంకటమ్మ, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, సతీష్‌గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ చెందొద్దు

మంచాల: మండలంలోని లింగంపల్లి గ్రామంలో సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే రంగారెడ్డి ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. ఎవరూ కూడా నిరాశకు గురికావొద్దని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఆర్డీఓ అనంతరెడ్డి, ఎంపీడీఓ బాల శంకర్, తహసీల్దార్ ఎంవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర ప్రక్రియ

చేవెళ్ల: సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికి అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని ఈర్లపల్లిలో ఆదివారం ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల పంపిణీ పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అందించటం నిరంతర ప్రక్రియని చెప్పారు. ఈర్లపల్లి గ్రామంలో మొదటి విడతగా 34 ఇందిరమ్మ ఇళ్లు, 54 రేషన్‌కార్డులు, 449 మందికి రైతు భరోసాకు సంబంధించి జాబితాలో వచ్చిన పేర్ల ప్రకారం లబ్ధిదారులకు పత్రాలను అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రకళ, ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ క్రిష్ణయ్య, ఎంపీడీఓ హిమబిందు, ఏఓ శంకర్‌లాల్, మాజీ సర్పంచులు రాజశేఖర్, నర్సింలు, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాది చేతల ప్రభుత్వం

షాబాద్: కాంగ్రెస్ చేతల ప్రభుత్వమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలో ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో ప్రజా పాలనలో భాగంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్తరేషన్ కార్డులు 4 సంక్షేమ పథకాలను అధికారికంగా ప్రారంభించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

యాచారం: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా మారాయని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా తక్కళ్లపల్లి గ్రామంలో ఆరు గ్యారంటీ పథకాల కింద అర్హులైన పేదలకు ఆదివారం ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన ప్రకారం అర్హులైన పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతుభరోసా తదితర పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో రాష్ట్రాన్ని లూటీ చేశారని మండిపడ్డారు. ఈ ప్రాంతంలో ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఫార్మాసిటీ రద్దు చేసినట్లు ప్రజల్లో మళ్లీ ఆందోళన చెందాల్సిన అవసరమే లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



వెంకటయ్యనాయక్ (ఫైల్)

కడ్తాల్: మండలంలోని కొండ్రిగానిబోడ్ పంచాయతీ పరిధిలోని పెద్దారెడ్డి చెరువుతండాకు చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన నేనావత్ వెంకటయ్యనాయక్‌కు భార్య శాంతితో పాటు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆయన సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 23న కుటుంబ విషయంలో భార్యతో గొడవ పడ్డాడు. తన బైక్, సెల్‌ఫోన్ ఇంట్లో వదిలిపెట్టి ఎవరికీ చెప్పకుండా వెంకటయ్యనాయక్ వెళ్లిపోయాడు. ఆచూకీ కోసం వెతికినా లభించలేదు. ఈ మేరకు ఆదివారం ఆయన భార్య శాంతి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

చేవెళ్ల: ప్రమాదవశాత్తు ఓ ఇల్లు దగ్ధమైన సంఘటన చేవెళ్ల మండలంలోని చనువెల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, ఫైర్‌సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తాజుద్దీన్‌కు చెందిన ఇంట్లో వికారాబాద్ జిల్లా పూడూర్ మండలం శీలపురానికి చెందిన దశరథ్ అద్దెకు ఉంటున్నారు. కాగా ఆదివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లారు. రాత్రి ఇంట్లో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు అంటుకున్నాయి. ఎవరూ లేకపోవటంతో వేగంగా వ్యాపించాయి. దూలాలకు అంటుకొని బయటికి పొగలు రావడంతో గ్రామస్తులు గమనించి ఫైర్ సిబ్బంది సమాచారం ఇచ్చారు. వెంటనే ఫైర్ అధికారి రవీందర్‌రెడ్డి, తన సిబ్బందితో వచ్చి మంటలు అదుపులోకి తెచ్చారు. కానీ అప్పటికే ఇల్లు మొత్తం ఖాళీ బూడిదయ్యింది. ఇంట్లో ఎవరూ లేకపోవటంతో ప్రాణనష్టం జరగలేదు. ఈ విషయం దశరథ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించటంతో గ్రామానికి బయలు దేరారు. రూ.1.50లక్షల నగదు, 6 తులాల బంగారం ఇంట్లో ఉందని తెలిపారు. ఆస్తినష్టం ఏ మేరకు జరిగిందో తెలియాల్సి ఉంది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వర్గీకరణతో మాదిగలకు న్యాయం



గ్రామ కమిటీని సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్‌రావుమాదిగ

చేవెళ్ల: మాదిగల సమస్యలను పరిష్కరించటంతో పాటు జాతి ఐక్యత కోసమే ఎమ్మార్పీఎస్ పని చేస్తోందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి క్యాసారం శంకర్‌రావుమాదిగ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ఏర్పాటుతో మాదిగలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ చేవెళ్ల గ్రామ నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా యాదయ్య, ఉపాధ్యక్షుడిగా దయాకర్, కార్యదర్శులుగా రాజు, వెంకటేష్, కోశాధికారిగా బాలక్రిష్ణ, అధికార ప్రతినిధిగా శ్రీనివాసులు, సలహాదారులుగా బుచ్చయ్య, జగన్నాథం, వెంకటయ్య, శ్రీనివాస్, మానిక్యం, మహేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాదిగ నాయకులు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

యాచారం: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ కూలీ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... ఒరిశా రాష్ట్రం నౌపాడ్ ప్రాంతానికి చెందిన భగబన్(42) కొద్ది నెలలుగా ఆకులామైలారం గ్రామ సమీపంలోని ఇటుక బట్టీలో కూలీగా పనిచేస్తున్నాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటుక బట్టీలో పనిచేసే తోటి కార్మికులు భగబన్‌ను శనివారం ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు తెలిపారు.

యువతి అదృశ్యం

యాచారం: మండల పరిధిలో ఓ యువతి అదృశ్యమైన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన కావ్య(20) శనివారం మార్కెట్‌కు వెళ్లొస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆదివారం కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

ఆరు గ్యారంటీల పేరుతో మోసం

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బాషా



కొప్పు బాషా సమక్షంలో బీజేపీలో చేరుతున్న నాయకులు

యాచారం: అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు బాషా ఆరోపించారు. మండల పరిధిలోని చింతుల్ల గ్రామానికి చెందిన దొడ్డి అంజయ్య, దొడ్డి బాబయ్యలతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఆదివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ సర్కార్ ఏడాదిగా సర్వేలు చేస్తూనే ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా గ్రామాల్లో అర్హులైన పేదవారికి సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, నాయకులు యాదయ్య, శ్రీధర్‌గౌడ్, కృష్ణ, కుమార్, ప్రకాష్, రాంరెడ్డి, పాండుచారి తదితరులు పాల్గొన్నారు.

మాంసం దుకాణదారులకు జరిమానా



దుకాణదారుడికి జరిమానా రశీదు అందజేస్తున్న అధికారులు

శంకర్‌పల్లి: నిబంధనలు అతిక్రమించి మాంసం విక్రయించిన వ్యాపారులకు మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. చేవెళ్ల రోడ్డులోని రెండు చికెన్ దుకాణాలు, సంగారెడ్డి రోడ్డులోని ఒక మటన్ దుకాణానికి రూ.9వేల(మూడింటికి కలిపి) జరిమానా వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం రోజున మాంసం విక్రయాలు జరపకూడదని దుకాణదారులకు ముందే నోటీసులు అందజేశామని తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

రసూల్‌పురా: తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 19న రాత్రి పలు దుకాణాల షట్టర్లు తెరిచి చోరీలకు పాల్పడిన కేసులో ఓ మైనర్‌తో పాటు మరో ఇద్దరు దొంగలను నార్త్‌జోన్ ప్రత్యేక క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి ఓ ఆయుధం, షట్టర్ లిఫ్ట్ చేసే ఇనుప రాడ్లు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ ఆదివారం కేసు వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ పాముల బస్తీకి చెందిన రాజేందర్ సింగ్, బాన్స్‌వాడకు చెందిన బండా సింగ్, మరో మైనర్ (17)తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. ఈ నెల 19న రాత్రి వీరు కార్ఖాన, తిరుమలగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో 12 షాపుల షట్టర్ల తాళాలు పగులగొట్టి నగదు చోరీకి పాల్పడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఏసీపీ రమేష్ నేతృత్వంలో తిరుమలగిరి సీఐ నాగరాజుతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వంద సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు వాటి ఆధారంగా నిందితులను గుర్తించారు. వారు నిజామాబాద్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో ఆదివారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

చేతికి గ్లౌవ్స్..ముఖానికి మాస్క్..

చోరీలు చేసేందుకు నగరానికి వచ్చే వీరు సిటీకి చేరుకోగానే బైక్‌లు చోరీ చేస్తారు. సదరు బైక్‌లపై తిరుగుతూ వ్యాపార సముదాయాల వద్ద రెక్కీ నిర్వహిస్తారు. ఎంపిక చేసుకున్న షాపులపై రాత్రి వేళల్లో పంజా విసిరేవారు. వేలి ముద్రలు దొరక్కుండా చేతికి తొడుగులు, ముఖాలకు మాస్క్‌లు ధరించేవారు. పథకం ప్రకారం షట్టర్లు లిఫ్ట్ చేసి చోరీలకు పాల్పడే వీరు పని పూర్తయిన వెంటనే బైక్‌లు, ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లకు చేరుకుని అక్కడి నుంచి నిజామాబాద్‌కు చేరుకునేవారు. తిరుమలగిరి, కార్ఖానా పీఎస్‌ల పరిధిలో చోరీలకు ముందు వీరు గాంధీ హాస్పిటల్ పార్కింగ్‌లో బైక్ దొంగిలించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వీరికి 23 కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు డీసీపీ పేర్కొన్నారు. కేసును చేధించిన పోలీసులను డీసీపీ అభినందించారు.

బెల్టు దుకాణాలపై పోలీసుల దాడులు

యాచారం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు దుకాణాలపై ఆదివారం సాయంత్రం ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి దాదాపు రూ.20 వేల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ గ్రామంలోని యార కరుణాకర్ ఇంట్లో దాడులు నిర్వహించి వివిధ రకాలకు చెందిన 48 బాటిళ్ల మద్యాన్ని, తక్కళ్లపల్లి తండాలోని అంగోత్ సుకుబాయి ఇంట్లో దాడులు నిర్వహించి వివిధ రకాలకు చెందిన 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరి అరెస్టు చేశారు. ఎస్‌ఓటీ పోలీసుల సూచన మేరకు యాచారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విక్రమ్ సింగ్ మాన్‌కు ప్రశంసాపత్రం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గత ఏడాది జరిగిన ప్రజా పాలన–ప్రజా విజయోత్సవాలను సమర్థంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించిన అదనపు పోలీసు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రశంసాపత్రం ప్రకటించింది. ఆదివారం పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనకు ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికను అందజేశారు. కేంద్ర ప్రభుత్వం మాన్‌కు శనివారం రాష్ట్రపతి పతకం ప్రకటించిన విషయం విదితమే.

పురాణాలతో యువత ప్రేరణ పొందాలి

వెంగళరావునగర్: యువత పురాణాల ద్వారా ప్రేరణ పొందాలని, ప్రతి ఒక్కరూ తమ లోపల దాగి ఉన్న అంతర్గత శక్తిని వినియోగించుకోవాలని ఆర్మేనియా, సూడాన్, పోలాండ్ దేశాల అంబాసిడర్ డాక్టర్ దీపక్ ఓహ్రా అన్నారు. వెంగళరావునగర్ కాలనీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ దీపక్ ఓహ్రా మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలన్నారు. ఇప్పటికే ఇండియా అన్ని రంగాల్లో అంతర్జాతీయ నాయకత్వాన్ని ప్రదర్శిస్తుందని, గతంలో మనం కోల్పోయిన సంపదను తిరిగి సాధిస్తున్నామని, ఇది మనకెంతో గర్వకారణమన్నారు. నలందా ప్రధాన నినాదం 'వుయ్ రూల్' స్కూల్ నినాదంలా కాకుండా యువతీ యువకులు గ్లోబల్ నినాదంగా మార్గనిర్దేశం చేయాలన్నారు. అనంతరం ఆయనను నలందా విద్యాసంస్థల చైర్మన్ మంతెన శ్రీనివాసరాజు, వైస్ చైర్మన్ సూర్యకాశ్యప్ వర్మ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ మూర్తి దేవరభట్ల, డాక్టర్ రమణ దేవరకొండ, డాక్టర్ రాంబాబు, స్కూల్ టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఐఐ 5కే వాకథాన్

మాదాపూర్: సీఐఐ ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) ఆధ్వర్యంలో ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా 5కే వాకథాన్‌ను నిర్వహించారు. ఐజీబీసీ కార్యాలయం నుంచి హైటెక్స్ వరకు కొనసాగిన ఈ వాకథాన్‌లో సిబ్బంది, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రీన్ బిల్డింగ్ పితామహుడు స్వర్గీయ ప్రేమ్‌సిజైన్ కు నివాళులర్పించారు. ఐజీబీసీ జాతీయ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వాకింగ్ దైనందిన జీవితంలో భాగం కావాలన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో సీఐఐ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. ఆనంద్, ఐజీబీసీ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ శ్రీనివాస్ మూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గణతంత్ర వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తదితరులు



బీజేపీ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండాను ఎగరేస్తున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, చిత్రంలో తదితరులు